సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 29 । నవంబర్ । 2024



విజృంభిస్తున్న చలిగాలులు

ఏజెన్సీలో చలిగాలులు సాయంత్రం నుంచి విజృంభిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. 8లో



ఘనంగా పంచామృతాభిషేకం

విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో త్రికాల పంచామృతాభిషేకం ఘనంగా నిర్వహించారు.



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణపుష్పార్చన, నిత్య కల్యాణం ఘనంగా జరిగాయి.

న్యూస్‌రీల్

జాబ్‌మేళాకు దరఖాస్తుల ఆహ్వానం

చింతపల్లి: స్థానిక డిగ్రీ కళాశాలలో త్వరలో నిర్వహించనున్న జాబ్‌మేళాకు సంబంధించి నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకులు కె.సంతోషి తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ, బీటెక్, ఎంటెక్ తదితర విద్యార్హత గల నిరుద్యోగ అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 29 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు అందజేయాలని కోరారు. వీటిని పరిశీలించిన అనంతరం జాబ్ మేళా తేదీని నిర్ణయిస్తామని తెలిపారు.

8న జాతీయ ఉపకార వేతన పరీక్ష

పాడేరు : జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి వచ్చేనెల 8న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో పి. బ్రహ్మాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉపకార వేతన పరీక్ష కోసం 638 విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదు చోట్ల ఈ పరీక్ష నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవి.ఇన్ స్కూల్ లాగిన్ లో ఉందన్నారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల యూడైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయి తమ పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసి అందజేయాలని డీఈవో సూచించారు.

ఏపీ పవర్ డిప్లొమా ఇంజనీర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం



జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

పాడేరు : ఏపీ పవర్ డిప్లొమా ఇంజనీర్ల అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలు గురువారం పాడేరు పట్టణంలోని కాఫీ హౌస్‌లో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్. సులేమ్‌రాజు (రంపచోడవరం, ఏఈ), జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం.వెంకటరమణ(జి.మాడుగుల, ఏఈ), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డి.భాస్కర్‌రావు (డీఈఈ, కమర్షియల్, పాడేరు). కోశాధికారిగా వి. శ్రీనివాస్ (జేఈ పాడేరు సెక్షన్)లను ఎన్నుకున్నారు. పాడేరు డివిజన కార్యదర్శిగా వి. ప్రభాకర్‌రావు (చింతపల్లి, ఏఈ), డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జి.త్రినాథరావు (అరకు, జేఈ), అరకు సెక్షన్ కోశాధికారిగా జె. రాముునాయుడు (జేఈ, టెక్నికల్, పాడేరు)ను ఎన్నుకున్నారు.

జాబ్‌మేళాలో 12 మంది ఎంపిక



ఉద్యోగ నియామక పత్రాలతో అభ్యర్థులు

సాక్షి,పాడేరు: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం,సీడాప్ సంస్థలు సంయుక్తంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 12 మంది ఎంపికయ్యారు. అపోలో ఫార్మసీ, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, రుద్ర కార్పొరేట్, మదర్ అండ్ ఫాదర్ నర్సింగ్ సర్వీసెస్ సంస్థల్లో ఉద్యోగాలకు నిర్వహించిన జాబ్‌మేళాకు 42 మంది హాజరయ్యారు. ఎంపికైన 12 మందికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టబ్బాయి నియామక పత్రాలను అందజేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ పి.రోహిణి, జిల్లా ఉపాధి కల్పన అధికారి సంగీత, జేకేసీ కోఆర్డినేటర్ జి.భాస్కరరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి జి.గౌరిశంకరరావు పాల్గొన్నారు.

ఘాట్ లోయలో ట్యాంకర్ బోల్తా



లోయలో పడిపోయిన తారు ట్యాంకర్

జి.మాడుగుల: చింతపల్లి వెళ్లే మార్గంలో కొక్కిరాపల్లి ఘాట్‌లో గురువారం సాయంత్రం 3గంటల సమయంలో తారు ట్యాంకర్ లోయలోకి బోల్తాపడింది. ఈ ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడినట్టు తెలుస్తోంది. హైవే పనుల నిమిత్తం మైదాన ప్రాంతం నుంచి జి.మాడుగుల తారును తీసుకువచ్చి అన్‌లోడ్ చేసి తిరిగి వెళుతుండగా ప్రమాదానికి గురైంది. ట్యాంకర్‌లోని డ్రైవర్, క్లీనర్‌తోపాటు మరో ఇద్దరు ఉన్నారు. వీరిలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ షణ్ముఖరావు తెలిపారు.

ప్రకృతి సిరులు

కలిసొచ్చిన సాగు విధానం

ప్రకృతి వ్యవసాయ విధానంలో చిరుధాన్యాల సాగు చేపట్టిన గిరిజన రైతులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. సాధారణ పద్ధతి కన్నా రెట్టింపు దిగుబడి రావడంతో ప్రకృతి విధానంపై ఆసక్తి చూపుతున్నారు. వారికి అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తూ పాడేరులోని ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రోత్సహిస్తోంది.



పెద్దసామల పంటను సేకరించిన గిరిజన మహిళ అందే

- చిరుధాన్యాల సాగులో రెట్టింపు దిగుబడి సాధిస్తున్న గిరి రైతులు
- పంట కోత ప్రయోగాల్లో గుర్తించిన అధికారులు
- గణనీయంగా పెరుగుతున్న విస్తీర్ణం
- మరింత ప్రోత్సహించేందుకు కార్యాచరణ



ఇరుకువలసలో రాగుల పంటలో కోత ప్రయోగం చేపట్టిన ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు

సాక్షి,పాడేరు: ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన చిరుధాన్యాల సాగు గిరిజన రైతులకు కలిసొచ్చింది. దీంతో సాగు విస్తీర్ణం రోజురోజుకు పెరుగుతోంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 3,600 ఎకరాల్లో రాగులు, సామలు, కొర్రల సాగు చేపట్టారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో దిగుబడి ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం పంట కోత పనుల్లో గిరిజనుల నిమగ్నమయ్యారు. అధికారులు పంట కోత ప్రయోగాలు చేపట్టారు.

- సాధారణ పద్ధతిలో సాగు చేసిన సందర్భాల్లో రాగులు, సామలు ఎకరాకు కనీసం 500 కిలోలు కూడా వచ్చేవి కావు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేయడం వల్ల నాణ్యమైన, ఆరోగ్యమైన ఉత్పత్తులను సాధిస్తున్నారు.
- రాగులు ఎకరాకు 1200 కిలోలు, సామలు, కొర్రలు వెయ్యి కిలోలకు పైగా దిగుబడి వస్తున్నట్టు గిరిజన రైతులు తెలిపారు.

అధిక దిగుబడి ఇలా..

- డుంబ్రిగుడ మండలం కరకవలస గ్రామానికి చెందిన గొల్లోరి గోపాల్ అనే గిరిజన రైతు ఎకరా విస్తీర్ణంలో సామ పంట చేపట్టారు. పంట కోత ప్రయోగంలో 1085 కిలోలు దిగుబడి రావడం ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు.
- హుకుంపేట మండలం తడిగిరి పంచాయతీలోని పాదిలి గ్రామంలో కాకర చంటిబాబు అనే యువ గిరిజన రైతు ఎకరాలో రాగుల సాగు చేపట్టి మంచి ఫలితాలు సాధించాడు.
- డుంబ్రిగుడ మండలం సొవ్వా ప్రాంతంలోని పనసవలస గ్రామానికి చెందిన పాంగి సొన్ను ఎకరాలో రాగుల సాగు చేపట్టగా 1220 కిలోలు దిగుబడి వచ్చింది.

ప్రకృతి విధానంలో చిరుధాన్యాల సాగు సమాచారం

రాగులు	:	1700 ఎకరాలు
పెద్దసామలు	:	1000 ఎకరాలు
చిన్నసామలు	:	600 ఎకరాలు
కొర్రలు	:	200 ఎకరాలు
అంటి కొర్రలు	:	100 ఎకరాలు



హుకుంపేట మండలం తీగలవలసలో రాగుల పంటను సేకరిస్తున్న గిరిజన మహిళ

ప్రకృతి విధానంతో మేలు



ప్రకృతి వ్యవసాయ విధానంలో రాగులను నాలుగేళ్లుగా సాగు చేస్తున్నా. ఈఏడాది కూడా పంట సాగు ఆశాజనకంగా ఉండడంతో ఇటీవల పంట కోతల ప్రయోగం చేపట్టారు.1200 కిలోల దిగుబడి వచ్చింది. గత ఏడాది కూడా అంతే దిగుబడి ఉంది. సాధారణ పద్ధతిలో సాగుచేస్తే పిలకలు అధికంగా ఉండేవి. 400 కిలోలకు మించి దిగుబడి వచ్చేది కాదు.

– కాకర చంటిబాబు, గిరిజన రైతు, పాదిలి, హుకుంపేట మండలం

గిరి రైతులను పోత్సహిస్తున్నాం



గత ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయాన్నిప్రోత్సహిస్తున్నాం. ఆవుపేడ, మూత్రాన్ని వినియోగించిన రైతులు మంచి దిగుబడి సాధించారు. దీనిని గమనించిన మిగతా రైతులు ఈ విధానంపై ఆసక్తి చూపుతున్నారు. దీని వల్ల ఏడాది ఏడాదికి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. పంట కోత ప్రయోగాల్లో అధిక దిగుబడులు నమోదయ్యాయి. వచ్చే ఖరీఫ్‌లో 6వేల ఎకరాల్లో సాగు చేపడతాం.

– భాస్కరరావు, డీపీఎం, ప్రకృతి వ్యవసాయ విభాగం, పాడేరు

కొనసాగుతున్న గురుకుల
ఉపాధ్యాయుల రిలే దీక్షలు

సంఘీభావం తెలిపిన సీపీఎం, ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం



రిలేదీక్షల్లో పాల్గొన్న సీపీఎం, ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం సభ్యులు

పాడేరు : తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఐటీడీఏ ఎదుట గిరిజన గురుకుల విద్యా సంస్థల ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు చేపడుతున్న రిలే దీక్షలు గురువారం నాటికి 13వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీపీఎం, ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు దీక్షల్లో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసే మెగా డీఎస్సీ నుంచి గిరిజన గురుకులాల్లో ఖాళీ ఉపాధ్యాయ పోస్టులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. తక్షణమే ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలన్నారు. 13 రోజులుగా ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల రిలే దీక్షల వల్ల విద్యార్థులు చదువులు సాగటం లేదన్నారు. దీనివల్ల ఈ విద్యా సంవత్సరంలో గిరిజన గురుకుల విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు వారికి సీపీఎం మద్దతుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొజ్జన్న, చిన్నారావు, దాస్, ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కంబిడి నీలకంఠం, ప్రధాన కార్యదర్శి ఎం. శోభన్‌బాబు, ఉపాధ్యక్షుడు పి.ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మరో నాలుగు క్యాడర్ల ఉద్యోగాల మెరిట్ లిస్ట్ విడుదల

సాక్షి,పాడేరు: స్థానిక వైద్య కళాశాలలో అవుట్ సోర్సింగ్,కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్న మరో నాలుగు క్యాడర్ల ఉద్యోగాలకు సంబంధించి అభ్యర్థుల తుది జాబితాన విడుదల చేశామని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతాదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, ఫిజియాట్రీ సోషల్ వర్కర్, జనరల్ డ్యూటీ అటెండెంట్ పోస్టులకు గాను ఈమెరిట్ లిస్ట్ విడుదల అయ్యిందని, అభ్యర్థుల ఎంపిక రోస్టర్ ఆధారంగా జరుగుతుందన్నారు.

రంగురాళ్లు తవ్వితే కేసులు

పెదవలస అటవీశాఖ రేంజ్ అధికారి శివరంజిని హెచ్చరిక



దొడ్డికొండలో అవగాహన సదస్సు నిర్వహించిన అటవీశాఖ సిబ్బంది

చింతపల్లి: అటవీశాఖ పరిధిలో రంగురాళ్ల తవ్వకాలు జరిపినా, ప్రోత్సహించినా కేసులు తప్పవని పెదవలస అటవీశాఖ రేంజ్ అధికారి శివరంజిని హెచ్చరించారు. జీకేవీధి మండలం దామనాపల్లి పంచాయతీ పరిధిలోని దొడ్డికొండ సమీపంలో రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నట్టు అందిన సమాచారంపై అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు రేంజర్ సిబ్బందితో కలిసి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ రేంజ్ పరిధిలో సిగనాపల్లి, దొడ్డికొండ ప్రాంతాల్లో రంగురాళ్ల తవ్వకాలను కొంతమంది వ్యాపారులు ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ నేపథ్యంలో రంగరాళ్ల తవ్వకాలు చేపడితే తీసుకునే చట్టపరమైన చర్యలపై సదస్సులో గిరిజనులకు అవగాహన కల్పించామన్నారు. అటవీ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు సంచరించినా తమకు సమాచారం అందించాలన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో రంగురాళ్ల తవ్వకాలను ప్రోత్సహించే వ్యాపారుల జాబితాను సిద్ధం చేశామన్నారు. ఈ ప్రాంతంలో వారి కదలికలను తమ సిబ్బంది ద్వారా గుర్తిస్తున్నామని తెలిపారు. తవ్వకాలు జరిగే అవకాశాలున్న ప్రదేశాల్లో 24 గంటలు తమ సిబ్బందిగస్తీ నిర్వాహణకు చర్యలు తీసుకుంటున్నామని రేంజ్ అధికారి వెల్లడించారు.

సామాజిక విప్లవ యోధుడు జ్యోతిరావు పూలే



చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే ఎం. విశ్వేశ్వరరాజు



జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు
- నివాళి అర్పించిన అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి




ఎల్లవరంలో పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

సాక్షి,పాడేరు: సామాజిక విప్లవ యోధుడిగా చరిత్రలో నిలిచిన మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శనీయమని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. ఆయన వర్ధంతిని గురువారం పాడేరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, ఎంపీటీసీలకే రామకృష్ణపాత్రుడు, ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు డి.పి.రాంబాబు పాల్గొన్నారు.

అరకులోయ టౌన్: జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం తన నివాసంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పాంగి చిన్నారావు, మండల పార్టీ అధ్యక్షుడు లొక్కోయి లక్ష్మణ కుమార్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొర్రా రాధిక, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గెద్దం నర్సింగరావు, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పంచాడి తిరుపతి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాది రమేష్, పార్టీ పార్లమెంట్ ప్రతినిధి కమిడి అశోక్, సర్పంచ్‌లు పెట్టెలి సుశ్మిత, దురియా భాస్కర్‌రావు, ఎంపీటీసీలు దురియా ఆనంద్‌కుమార్,. గరం పూర్ణ, సమర్ది శత్రుఘ్న, స్వాభి రాంచందూర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహానేత జ్యోతిరావుపూలే అని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని ఎల్లవరంలో గురువారం ఆయన వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బొడ్లంక ఎంపీటీసీ లోసూరి సూర్యకాంతం,ఎల్లవరం సర్పంచ్ బెన్నోజి నూకరత్నం, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ ప్రచార పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ అభిషేక్‌గౌడ, సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డీఎంహెచ్‌వో

సాక్షి,పాడేరు: హెచ్‌ఐవీ/ఎయిడ్స్ మహమ్మారిపై జిల్లా వ్యాప్తంగా ప్రజలను చైతన్య పరిచే విధంగా విస్తృత ప్రచారం చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఏజే అభిషేక్‌గౌడ కోరారు. వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలు రూపొందించిన హెచ్‌ఐవీ/ఎయిడ్స్ అవగాహన ప్రచార పోస్టర్లను సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, డీఎంహెచ్‌వో జమాల్‌బాషాతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో ప్రచారం చేపట్టాలన్నారు. వచ్చేనెల ఒకటిన ప్రపంచ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలన్నారు. పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సీపీఎం రాంచందర్, డీఎండీవో చిరంజీవి, ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి పాల్గొన్నారు.

పరిశుభ్రంగా చాపరాయి జలవిహారి

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్
- నిర్వాహకులకు సూచన



చాపరాయి జలవిహారి వద్ద సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



జలవిహారి సిబ్బందికి సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్



అరకు పద్మాపురం గార్డెన్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

డుంబ్రిగుడ: చాపరాయి జలవిహారిని పరిశుభ్రంగా ఉంచాలని పాడేరు ఐటీడీఏ పీవో వి. అభిషేక్ పిలుపునిచ్చారు. గురువారం చాపరాయిలో జలవిహారి వద్ద స్వదేశీ దర్శన్ 2.0 ప్రాజెక్టు కోఆర్డినేటర్ రతన్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత డ్రై సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ విదేశీ పర్యాటకులకు సందర్శనకు వస్తున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించి పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని నిర్వహకులను ఆయన కోరారు. చిరు వ్యాపారాలు చేసే స్టాళ్ల వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడ వచ్చే వాహనాల పార్కింగ్‌కు నిర్వహిస్తామని పీవో తెలిపారు. చాపరాయి అభివృద్ధి తనకు ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ అని ఈ ప్రాంతాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పీవో తెలిపారు. ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, డిప్యూటీ తహసీల్దార ముజీబ్, టూరిజం మేనేజర్ మేనేజర్ మరళి, పంచాయితీ కార్యదర్శి విజయ్, చాపరాయి నిర్వహకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన అరకులోయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణకు అందరూ బాధ్యత తీసుకోవాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ కోరారు. గురువారం ఆయన స్థానిక పద్మాపురం గార్డెన్‌ను సందర్శించారు. కార్మికులతో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక కేంద్రాల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ నిషేధం అమలుకు కృషి చేయాలని ఆయన కోరారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని పీవో సూచించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. బేస్ లైన్ పరీక్షల ప్రకారం విద్యార్థులను ఏబీసీడ గ్రూపులుగా విభజించి సీ,డీ విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ చూపాలని సూచించారు. ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు, మ్యాజియం మేనేజర్ మురళి, పద్మాపురం గార్డెన్ మేనేజర్ బొంజిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

గురుకుల పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణం: మృతురాలి తండ్రి మోహనరావు కన్నీరుమున్నీరు



ప్రియాంక మృతదేహం

అరకులోయ రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న గురుకుల విద్యార్థిని మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని యండపల్లివలస గురుకుల బాలికల పాఠశాలలో జన్ని ప్రియాంక (8) 6వ తరగతి చదువుతోంది. ఈమె మూడు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గురువారం ఉదయం వచ్చి ఆమెను అరకులోయ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం తిరిగి పాఠశాలకు తీసుకువచ్చారు. స్వగ్రామం దుమగుడకు తీసుకువెళ్లేందుకు తమకు అనుమతి ఇవ్వాలని కోరినా ప్రిన్సిపాల్ కుదరదని సమాధానం ఇచ్చారని విద్యార్థిని తండ్రి మోహన్‌రావు తెలిపారు. దీంతో ఆమెను పాఠశాలలోనే వదిలి ఇంటికి వెళ్లిపోయామని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో సాయంత్రం ప్రియాంక ఆరోగ్యం విషమించడంతో పాఠశాల సిబ్బంది, నిర్వాహకులు అరకు ఏరియా ఆస్పత్రికి హుటాహుటిన తరలించారు. అప్పటికే విద్యార్థిని మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. తమ కుమార్తె ప్రియాంక మృతికి పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యం కారణమని తండ్రి మోహనరావు ఆరోపిస్తూ కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇలావుండగా మృతి చెందిన ప్రియంక కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని పద్మాపురం పంచాయతీ ఉప సర్పంచ్ జన్ని భగత్‌రాం డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలపై కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరారు.

కిరండూల్‌కు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 1–స్లీపర్ క్లాస్ కోచ్, డిసెంబరు 6,8,10,12,14,16,18,20,22, 24,26,28,30, జనవరి 1వ తేదీల్లో 1–థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌లను జతచేస్తున్నారు. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు 2వ తేదీ నుంచి జనవరి 1వ తేదీ వరకు 1–స్లీపర్ క్లాస్ కోచ్, డిసెంబరు 7,9,11,13,15,17,19,21,23,25,27, 29,31, జనవరి 2వ తేదీల్లో 1–థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌ను జతచేస్తున్నారు.

క్లుప్తంగా

6 నుంచి ఆర్టీసీ ఉద్యోగులకు క్రీడా పోటీలు

దాబాగార్డెన్స్: ఆర్టీసీ ఉద్యోగులకు వచ్చే నెల 6 నుంచి 8 వరకు క్రీడా పోటీలు కైలాసగిరి పోలీస్ క్రీడా ప్రాంగణంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్ ఆధ్వర్యంలో దేశంలోని అన్ని రాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొననున్నారు. ఈ మేరకు ఆర్టీసీ జోన్-1 ఇన్‌చార్జి ఈడీ విజయ్‌కుమార్ ఆర్టీసీ అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీలతో గురువారం ఎంవీపీ బస్ స్టేషన్, ఈడీ క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో సీఎంఈ(ఎం) జి.విజయరత్నం, విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా అధికారి కె.పద్మావతి, విజయనగరం జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ, విశాఖపట్నం డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సత్యనారాయణ, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ ఎం.సుధాబిందు, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు, కమిటీల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న చలిగాలులు

- వణికిపోతున్న గిరి గ్రామాలు
- కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



గూడెంకొత్తవీధి ప్రాంతంలో దట్టంగా కురుస్తున్న మంచు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో చలిగాలులు సాయంత్రం నుంచి విజృంభిస్తున్నాయి. బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా గురువారం పొగమంచు ప్రభావం అంతంతమాత్రంగానే కనిపించింది.అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 12.4, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 14డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలిగాలుల తీవ్రతకు చలిమంటలు కాగుతూ ఉపశమనం పొందారు.

రాజవొమ్మంగి: మండలంలో వేకువజామున, రాత్రి వేళలో మంచు కురుస్తోంది. ఉదయం 9 గంటల తరువాత మాత్రమే సూర్యోదయం అవుతోంది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు 19 డిగ్రీలకు పడిపోయాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు చలిగాలులకు వణికిపోతున్నారు.

గూడెంకొత్తవీధి: చలి ప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గురువారం మంచు అంతంతమాత్రంగా కురిసింది.

డుంబ్రిగుడ: మండలంలో రెండు రెండు రోజులుగా చలి తీవ్రత నెలకొనడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. రగ్గులు, ఉన్ని దుస్తులను ఆశ్రయిస్తున్నారు. చలిమంటలు కాగుతూ ఉపశమనం పొందుతున్నారు.

ఉపాధి పనులపై జవాబుదారీతనం అవసరం



ప్రజావేదికలో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



ప్రజావేదికలో పనుల వివరాలు వెల్లడిస్తున్న సిబ్బంది

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం
- ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక

ముంచంగిపుట్టు: ఉపాధి హామీ పథకం ద్వారా జరిగే పనులపై క్షేత్రసాయి నుంచి జవాబుదారీతనంగా ఉపాధి సిబ్బంది పనిచేయడం ముఖ్యమని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో రూ.24.7కోట్లు మెటీరియల్ ద్వారా రూ.96.22లక్షలు పంచాయితీ రాజ్ శాఖ ద్వారా రూ.9,93,47,000లు, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ద్వారా 15,22,56,000లు, సమగ్ర శిక్ష అభియాన్ శాఖ ద్వారా 10.96లక్షలతో జరిగిన పనులపై ఇటీవల 15వ విడుత సామాజిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో గుర్తించిన అంశాల వెల్లడికి గురువారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ డాక్టర్ డి.వి.విద్యాసాగర్ ఆధ్వర్యంలో ప్రజావేదికను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పాల్గొని మాట్లాడుతూ ఉపాధి పనులు పారదర్శకంగా జరగాలన్నారు. వేతనదారులకు పనులు కల్పించడంతో పాటు మస్తర్లు సకాలంలో వేయాలన్నారు. ఉపాధి పనుల కల్పనలో ఎటువంటి అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తనిఖీలు చేసే అధికారులు ఉపాధి పనులలో ఎటువంటి అవినీతి జరిగినా కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సోషల్ ఆడిట్ అధికారులకు ఆదేశించారు. మండలంలోని 23 పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై కొలతలు, లెక్కలలో తేడాలు, పని కల్పించిన ప్రదేశాల్లో బోర్డులకు పేర్లు లేక పోవడం, వేతనదారులకు కూలీ సొమ్ము తక్కువగా పడడంపై సోషల్ ఆడిట్ అధికారులు ప్రజావేదికలో తెలియజేశారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ విద్యాసాగర్ మాట్లాడుతూ మండలంలో అన్ని పంచాయతీల్లో సామాజిక తనిఖీల్లో రూ.33,816 రికవరీ చేయడంతో రూ.27,200ల అపరాధ రుసుము విధించినట్టు చెప్పారు.దీంతో పాటు ప్లాంటేషన్‌లో చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తగా ప్లాంటేషన్ చేయించాలని ఉపాధి సిబ్బంది ఆయన ఆదేశించారు. జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి, అడిషనల్ విజిలెన్స్ అధికారి వెంకటేశ్వరరావు, ఏపీడీ శ్రీనివాసు, ఎంపీపీ సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు రమేష్, ఎంపీడీవో శ్రీసాయిహర్ష, పీఆర్ ఏఈ మురళికృష్ణ, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ రాములు, ఏపీవో సంఘంనాయుడు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపాధి హామీ సిబ్బంది, వేతనదారులు పాల్గొన్నారు.

యంత్ర పరికరాల కొనుగోలుకు నిధులు

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్



వీడీవీకే కేంద్రాన్ని సందర్శించి పీడీ మురళీతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్



గిరిజన మహిళకు నాటు కోళ్ల పెంపకానికి మండల సమైక్య నుంచి ఆర్థిక సాయమందిస్తున్న పీవో అభిషేక్

డుంబ్రిగుడ: వనదన్ వికాస్ కేంద్రానికి అవసరమైన యంత్ర పరికరాలు కొనుగోలుకు నిధులు విడుదల చేస్తామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ తెలియజేశారు. మండలంలో ఉన్న వీడీవీకేలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ముడిసరకుల కొనుగోలు, బిస్కెట్ తయారీ యూనిట్ నిర్వహణ, ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్‌పై వీడీవీకే సభ్యులకు అవసరమై శిక్షణ అందిస్తామన్నారు. పూర్తిస్థాయిలో పరికరాలను వచ్చే నెల 15వ తేదీలోగా సిద్ధం చేసుకుని ఉత్పత్తులు ప్రారంభించాలన్నారు. వీడీవీకే ఉత్పత్తులను వారపు సంతలోనూ, దుకాణాలకు విక్రయించాలని సూచించారు. నాణ్యమైన ఉత్పత్తులను చేసి మార్కెటింగ్ చేయాలన్నారు. ఉత్పత్తులో నాణ్యత పాటిస్తే తగిన విధంగా లాభాలు వస్తాయని చెప్పారు. గసభ పంచాయితీ అంద్రగూడ గ్రామానికి చెందిన కిల్లో అనూషకు నాటు కోళ్ల పెంపకానికి మండల సమైక్య నుంచి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి మురళీ చేతుల మీదుగా అందజేశారు. రుణాన్ని సద్వినియోగం చేసుకొని స్వయంకృషితో ఆర్థికాభివృద్ధి చెందాలని లబ్ధిదారులకు సూచించారు. నాటు కోళ్ల పెంపకం వివరాలను, ఆదాయాన్ని అడిగి తెలుసుకున్నారు. వెలుగు సిబ్బంది, వీడీవీకే సభ్యులు పాల్గొన్నారు.

గ్రావెల్, బండ రాళ్ల రవాణాపై అధికారుల దాడి

రోలుగుంట: కుసుర్లపూడి నుంచి అక్రమంగా నర్సీపట్నం వైపు గ్రావెల్, బండరాళ్లు తరలి స్తున్న ట్రాక్టర్లపై రోలుగుంట పోలీసులు, రెవెన్యూ సిబ్బంది దాడి చేశారు.జె.పి.అగ్రహారంలో ఈ ట్రాక్టర్లు ఆపి తనిఖీలు చేశారు. డ్రైవర్ల వద్ద ఏ విధమైన అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని రోలుగుంట పోలీసు స్టేషన్‌కు తరలించారు. మైనింగ్ అధికారులకు తదుపరి చర్యల కోసం అప్పగిస్తామని విలేకరులకు తెలిపారు.

గిరిజన ఉద్యోగులపై కూటమి ప్రభుత్వం వివక్ష



సమావేశమైన మండల డీటీఎఫ్ కమిటీ సభ్యులు

గూడెంకొత్తవీధి: నర్సీపట్నంలో విధులు నిర్వహిస్తున్న సహాయ సాంఘిక సంక్షేమాధికారి మొల్ల శ్యామలను ఎటువంటి విచారణ లేకుండా ముందస్తు సమాచారం లేకుండా జిల్లా కేంద్రానికి సరెండర్ చేయడం అన్యాయమని, దీన్ని ఖండిస్తున్నామని డీటీఎఫ్ గూడెంకొత్తివీధి మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వినోద్‌కుమార్, లక్ష్మణ్ తెలిపారు. మండల కేంద్రంలోని డీటీఎఫ్ నాయకులు గురువారం సమావేశమయ్యారు. శ్యామల విధి నిర్వహణలో ఖచ్చితంగా పనిచేశారన్నారు. బాధ్యులైన వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు వారికి కొమ్ముకాస్తూ అక్రమాలను అడ్డుకొన్న గిరిజన మహిళా అధికారి అయిన శ్యామలను జిల్లా కేంద్రానికి సరెండరు చేయడం ఎంతమేరకు సబబని వారు ప్రశ్నించారు. గిరిజన ఉద్యోగులపై ఇటువంటి వివక్ష ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. దీనిపై తగిన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకూ తాము డీటీఎఫ్ సంఘం ద్వారా పోరాడతామన్నారు. దీనబంధు, రవిప్రసాద్, దొర, రమణ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుతో బహుళ ప్రయోజనాలు

- విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ సత్యనారాయణ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సత్యనారాయణ



విద్యుత్ వినియోగదారుడి నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ సత్యనారాయణ

అడ్డతీగల: విద్యుత్ పొదుపుతో బహుళ ప్రయోజనాలు కలుగుతాయని కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రిడ్రసల్ ఫోరమ్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నాళ్లకు బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి లోటు ఏర్పడుతుందన్నారు. దీనికి దేశవ్యాప్తంగా బొగ్గు నిల్వలు నిండుకోవడమే కారణమన్నారు. ఈ మేరకు సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. దీనికి తగిన ప్రోత్సాహకాలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. ఇంధన పొదుపు, వాడకం, సోలార్ విద్యుదుత్పత్తి వంటి అంశాలను వివరించారు. అలాగే విద్యుత్ సరఫరాలో లోపాలు తలెత్తే ఇబ్బందులు వంటి సమస్యలు, పరిష్కార వివరాలను విద్యార్థులకు తెలియజేశారు. ఫోరమ్ సాంకేతిక సభ్యులు ఎం.మసల్‌మణి, ఆర్థిక సభ్యుడు షేక్ బాబర్, ట్రాన్స్‌కో రంపచోడవరం రూరల్ డీఈ గ్రాబ్రియేల్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ వద్ద సమస్యల పరిష్కార వేదిక

విద్యుత్ సేవల లోపాల పరిష్కారానికి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం(సిజిఆర్‌ఎఫ్) పనిచేస్తోందని చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ అన్నారు.స్థానిక సబ్‌స్టేషన్ వద్ద వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సేవల్లో లోపాలతో పాటు విద్యుత్‌శాఖ సమస్యను పరిష్కరించకపోయినా తమను సంప్రదించవచ్చన్నారు. విద్యుత్ సమస్య ఏది ఉత్పన్నమైనా వినియోగదారులు 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే లిఖితపూర్వక ఫిర్యాదుని తమకు పంపవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకుని విచారణ చేస్తామన్నారు. ఫిర్యాది వాదనను మొబైల్ వాయిస్ కాల్ ద్వారా నమోదు చేస్తామన్నారు. విద్యుత్‌శాఖ అభ్యంతరాలను పరిగణలోనికి తీసుకుని విచారణ అనంతరం ఆర్డర్ కాపీని వినియోగదారుడైన ఫిర్యాది ఇంటికే పంపిస్తామన్నారు. చైర్‌పర్సన్, కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రిడ్రసల్ ఫోరమ్, ఏపీఈపిడిసిఎల్, కార్పొరేట్ కార్యాలయం, విశాఖపట్నం అడ్రస్‌కి డాక్యుమెంట్స్ పంపించాలన్నారు. 60 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. గురువారం నాటి పరిష్కార వేదిక కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయన్నారు. ఫోరమ్ సాంకేతిక సభ్యులు ఎం.ముసల్‌మణి, ఆర్థిక సభ్యులు బాబర్, ట్రాన్స్‌కో డీఈ గాబ్రియేల్ తదితరులు పాల్గొన్నారు.

అత్తవారి తోటలో వ్యక్తి ఆత్మహత్య!


అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



ప్రసాద్ మృతదేహం

నర్సీపట్నం: నర్సీపట్నం మండలం గురందరపాలెంలోని అత్తవారి తోటలో అల్లుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్సై రాజారావు అందించిన వివరాలు.. జె.ప్రసాద్ (38) అనకాపల్లిలో ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గురందరపాలేనికి చెందిన ధనలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. భార్యాభర్తలు గత కొంతకాలంగా గొడవలు పడుతున్నారు. ధనలక్ష్మి గురందరపాలెంలోని అమ్మవారి ఇంటి వద్ద ఉంటోంది. బుధవారం రాత్రి ప్రసాద్ గురందరపాలెం వచ్చాడు. ఊరి చివరిలో ఉన్న అత్తవారికి చెందిన తోటలో చెట్టుకు ప్లాస్టిక్ తాడుతో ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. సంఘటన స్థలంలో అతని ద్విచక్ర వాహనం ఉంది. మద్యం సీసా కూడా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అలగాం జలపాతం హోయలు



అలగాం గ్రామం వద్ద జలపాతం

జి.మాడుగుల: అలగాం గ్రామం వద్ద జలపాతం కనువిందు చేస్తోంది. జి.మాడుగుల మండలంలో లువ్వాసింగి పంచాయతీ అలగాం గ్రామానికి వెళ్లే మార్గంలో రెండు కొండల మధ్య జాలవారుతున్న జలపాతం ఇటీవల దర్శనమిచ్చింది. దీంతో ఇక్కడ పర్యాటకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

భూరికార్డుల తారుమారుపై విచారణ జరపండి

- బాధిత గిరిజనుల డిమాండ్
- అర్ధనగ్నంగా నిరసన



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న గిరిజనులు

అనంతగిరి (అరకులోయ రూరల్): మండలంలో రొంపల్లి పంచాయతీలో భూరగ, చిన్నకోనేల ఆదివాసీ గిరిజనుల వ్యవసాయ భూములు అన్యాక్రాంతం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని బాధిత గిరిజన రైతులు డిమాండ్ చేశారు. గురువారం వారు భూరగలో అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ వార్డు సభ్యుడు సోమిల అప్పలరాజు మాట్లాడుతూ గిరిజనులను మభ్యపెట్టి వ్యవసాయ భూముల రికార్డులు తారుమారు చేసి కబ్జాకు పాల్పడ్డారన్నారు. గిరిజన రైతులు 70 కుటుంబాలు 105 ఎకరాలు జిరాయితీ భూమిలో తాత ముత్తాతల కాలం నుంచి వ్యవసాయం చేస్తున్నారన్నారు. 2017లో రెవెన్యూ అధికారులు మైదాన ప్రాంతాలకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై భూరికార్డులు మార్చుశారని ఆరోపించారు. గతంలో పలుమార్లు కలెక్టర్, ఐటీడీఏ పీవోలకు ఫిర్యాదు చేసినా నేటికీ భూసమస్య పరిష్కారం కాలేదన్నారు. వాస్తవాలు తేల్చేందుకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ, కలెక్టర్‌తో కూడిన కమిటీని నియమించి గ్రామంలో విచారణ జరిపించాలన్నారు. లేకుంటే దశలవారీగా ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. దీనిలో భాగంగా వచ్చేనెల 13న పాడేరులో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 24 గంటల రిలే నిరహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధిత గిరిజనులు పెంటయ్య, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ దుర్మరణం



లక్ష్మీ మృతదేహం

యలమంచిలి రూరల్: రేగుపాలెం రైల్వేస్టేషన్‌కు సమీపంలో డౌన్‌లైన్‌లో రైలు ఢీకొని గురువారం యలమంచిలి మండలం పేట బయ్యవరం గ్రామానికి చెందిన కొయ్య లక్ష్మి(36) మృతి చెందింది. అవివాహిత అయిన లక్ష్మి బయ్యవరంలో మేనమామ ఇంటివద్ద ఉంటోంది. గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్లి వస్తుండగా రైలుపట్టాలు దాటుతున్న సమయంలో హౌరా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. కొన ఊపిరితో ఉన్న ఆమెను మేనమామ కుమారుడు కిల్లాడి అప్పలనాయుడు గమనించి భుజాలపై వేసుకుని గ్రామంలోకి తీసుకొచ్చి చికిత్స నిమిత్తం ఆటోలో యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. తలకు బలమైన గాయమై అప్పటికే తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమెను పరీక్షించిన డ్యూటీ డాక్టర్ అప్పటికే మృతి చెందినట్టు కుటుంబ సభ్యులకు చెప్పారు. మతిస్థిమితంలేని కారణంగా లక్ష్మి కొంతకాలంగా విశాఖపట్నం మానసిక చికిత్సాలయంలో వైద్యం చేయించుకుంటోందని కుటుంబ సభ్యులు తుని రైల్వే పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తుని రైల్వే పోలీసులు ప్రమాద స్థలానికి వచ్చి ప్రమాదంపై ఆరా తీశారు. బహిర్భూమికి వెళ్లి వస్తున్న లక్ష్మి రెండు రైల్వే లైన్లపై నుంచి ఆ సమయంలో రెండు రైళ్లు ఒకేసారి రావడంతో తికమక పడి మధ్యలో ఉండిపోవడంతో ప్రమాదానికి గురై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి మేనత్త నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ జి. శ్రీనివాసరావు తెలిపారు.

మద్యం అక్రమ రవాణా : ఇద్దరు అరెస్టు

దేవరాపల్లి/చోడవరం రూరల్: కొత్తపెంట గ్రామంలో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు చోడవరం ఎక్సైజ్ సీఐ కె.వి.బాపునాయుడు గురువారం తెలిపారు. మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్నట్టు అందిన ముందస్తు సమాచారంతో కొత్తపెంట రోడ్డులో మాటు వేసి ఎస్.అప్పారావు, కె.నారాయణరావును అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 39 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

రెండు గంజాయి కేసుల్లో ఐదుగురి అరెస్టు

నిందితులు విజయవాడ, జంగారెడ్డిగూడెం ప్రాంతీయులు



గంజాయి తరలిస్తూ పోలీసులకు చిక్కిన నిందితులు వెంకటేష్, మణికంఠ

మోతుగూడెం: గంజాయికి సంబంధించి రెండు కేసుల్లో ఐదుగురిని అరెస్టు చేసినట్టు డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విజయవాడ ప్రాంతానికి చెందిన ఇందుకూరి త్రినాథ్, డీకొండ రాజేష్, రెళ్ల సాయికిరణ్, మరో బాలుడు చుట్టుపక్కల ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు దొంగలించి విక్రయిస్తుంటారు. ఆ మొత్తంతో గంజాయి కొనుక్కొని తాగి జల్సా చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆ నలుగురు ఈనెల 26న పాడేరు ప్రాంతంలో గంజాయి కొనుక్కొని రెండు బైక్‌లపై బయలుదేరారు. డొంకరాయి పోలీసుస్టేషన్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా వీరు పట్టుబడినట్టు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన నలుగురు గుంటూరు పరిసరి ప్రాంతాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడినట్టు తమ దర్యాప్తులో తేలిందన్నారు. ఈ విషయాన్ని గుంటూరు పోలీసులకు తెలియజేశామన్నారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు, బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించినట్టు ఆయన వివరించారు. ఇలావుండగా బుధవారం డొంకరాయి పోలీసు స్టేషన్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో రెండు కిలోల గంజాయి తరలిస్తూ ఇద్దరు పట్టుడినట్టు ఎస్‌ఐ తెలిపారు. బైక్‌పై వస్తున్న వీరిని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడిందన్నారు. జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన వీపు వెంకటేష్, మరిగల మణికంఠగా గుర్తించినట్టు ఆయన తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన డొంకరాయి రైటర్ శ్రీనివాస్‌గౌడ్, హెచ్‌సీ కల్యాణ్, పీసీ పోశయ్యలను చింతూరు ఏఎస్పీ సంజయ్‌కుమార్ మీనా అభినందించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రెండో స్థానం

- కొక్కిరాపల్లి గురుకుల విద్యార్థినుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థినులు

యలమంచిలి రూరల్: కొక్కిరాపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకులం విద్యార్థినులు రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇటీవల పల్నాడు జిల్లా సత్తెనపల్లి గురుకులంలో ఫ్యూచరాన్-2024 పేరుతో రాష్ట్రస్థాయి అంబేద్కర్ గురుకులాల వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఈ పోటీల్లో స్థానిక కొక్కిరాపల్లి గురుకులం విద్యార్థినులు ప్రకృతి విపత్తుల సమయంలో వరదలు సంభవించినపుడు చేపట్టాల్సిన నివారణ చర్యలపై వినూత్నంగా రూపొందించి ప్రదర్శించిన ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయిలో రెండో స్థానం లభించిందని గురుకులం ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం గురువారం మీడియాకు తెలిపారు. ద్వితీయ బహుమతికి ఎంపికైన ప్రాజెక్టు తయారుచేసిన విద్యార్థులకు జ్ఞాపికతోపాటు రూ.5 వేల నగదు బహుమతి లభించినట్టు చెప్పారు. ప్రాజెక్టును రూపొందించిన 9వ తరగతి విద్యార్థులు పి.లక్ష్మీ ప్రియ, బి.త్రివేణి, గైడ్ టీచర్లు ఎల్.వరలక్ష్మి, సిహెచ్.వి.ఎస్.ఎల్.కుమారిలను గురువారం గురుకులంలో జరిగిన కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థినులు అభినందించారు.

మాకవరంలో వరి కుప్పలు దగ్ధం

- కాలిపోయి బూడిదైన 11 కుప్పలు
- రూ.5.50లక్షల మేర పంట నష్టం



మాకవరంలో దగ్ధమవుతున్న వరి కుప్పలు



మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న గిరిజన రైతులు

ముంచంగిపుట్టు: మండలంలోని మాకవరం పంచాయతీ కేంద్రంలో గురువారం మధ్యాహ్నం కలం వద్ద నూర్పిళ్లకు సిద్ధంగా 11 వరి కుప్పలు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్ల పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో గిరిజన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మాకవరం పొలిమేర వద్ద ఉన్న కలంలో ఇటీవల కొసిన వరి పంట కుప్పలను గిరిజన రైతులు నూర్పిళ్లకు సిద్ధంగా ఉంచారు. వరి కుప్పల నుంచి భారీ స్థాయిలో మంటలు వస్తుండడంతో గమనించిన రైతులు పరుగులు తీశారు. గిరిజన రైతులు బిందెలు, బకెట్లు పట్టుకొని నీటితో మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసేటప్పటికీ వరి కుప్పులు పూర్తిగా కాలిపోయి అగ్నికి ఆహుతయ్యాయి. చేతికి వచ్చిన వరి పంట ఇలా కాలిపోయి బూడిదవడంతో గిరిజన రైతులు బోరున విలపించారు. వరి పంట కాలిపోవడంతో మాకవరం గ్రామానికి చెందిన బాధిత గిరిజన రైతులు కోడా రాంబాబు, మర్ద జీనబంధు,వంతాల బోగ్గు,సుక్రి లైకోన్, మర్ద కార్తీక్, గోల్లోరి మొదునో, కోడా సుందరమ్మ, మట్టం సూర్యనారాయణపడాల్, కోడా ధనుర్జయ్, బజ్జింగి రాజు, బజ్జింగి రామన్నల 11 వరికుప్పలు దగ్ధమయ్యాయి. ఒక్కొక్క వరి కుప్ప రూ.50వేల వరకు ఉంటుందని, రూ.5.50లక్షల వరకు నష్టం జరిగిందని బాధిత రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. పంటలకు నిప్పు పెట్టిన వానిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. జరిగిన సంఘటనపై రైతుల నుంచి వివరాలు సేకరించామని, ఉన్నతాధికారులకు తెలియజేసినట్టు తహసీల్దార్ నర్సమ్మ తెలిపారు.